# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 30.09.2025 | 24 క్యారెట్లు 9,88.300 | కిలో వెండి 1,20,000 | 30 °C | సంపుటి:3 | సంచిక:273

www.vishalabharati.com




# గిన్నిస్ రికార్డులో మన బతుకమ్మ

- సరూర్‌నగర్ మైదానంలో బతుకమ్మ
- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది
- రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు
- 63 అడుగుల భారీ బతుకమ్మ
- 1354 మంది మహిళలతో బతుకమ్మ
- రెండు విభాగాల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్

> రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించింది. గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కార్యక్రమంలో భాగంగా 63 అడుగుల భారీ బతుకమ్మ ఏర్పాటు చేశారు. ఒకేసారి 1354 మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మన తెలంగాణ బతుకమ్మ రెండు విభాగాల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం సంపాదించుకుంది. అతిపెద్ద బతుకమ్మగా, అతిపెద్ద జానపద నృత్యంగా గిన్నిస్ రికార్డు సృష్టించింది. కార్యక్రమానికి మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. భారీ బతుకమ్మ చుట్టూ మహిళలు లయబద్ధంగా బతుకమ్మ ఆడారు. బతుకమ్మను గత వెయ్యేళ్లుగా తెలంగాణా ప్రజలు తమ ఇంటి దేవతగా పూజిస్తున్నారు. తెలంగాణ మిగతా 2లో



# స్థానిక సమరం..!



- రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు
- షెడ్యూల్ విడుదల అయ్యింది
- రిజర్వేషన్లు సైతం ఖరారు చేసింది
- ఎన్నికలపై ఫుల్ ఫోకస్
- అమలులో ఎన్నికల కోడ్
- ప్రభుత్వం అంగీకారం కోసం షెడ్యూల్

2

> తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. రాష్ట్రంలో ఎన్నికలకు సబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యింది. ఇప్పటికే ప్రభుత్వ యంత్రాంగం రిజర్వేషన్లు సైతం ఖరారు చేసిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. తక్షణమే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

## అచ్చమైన దసరా కానుక

- రాష్ట్రంలోని పంచాయతీ కార్యదర్శులు
- సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు
- రూ. 104 కోట్ల బిల్లులను విడుదల
- త్వరలో కార్యదర్శుల ఖాతాల్లో జమ
- పెండింగ్ బిల్లుల చెల్లింపుకు ప్రాధాన్యత
- మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు

2



## 'నా స్టాప్ వచ్చేసింది.. ఇక బై'

- వీసీ సజ్జనార్ ఐపీఎస్ బదిలీ
- టీజీఎస్ఆర్టీసీ సారథిగా
- నాల్గున్నర సంవత్సరాలు
- ఎక్స్‌లో పోస్ట్ చేశారు
- ఆర్టీసీకి ప్రత్యేక కృతజ్ఞతలు
- సమర్థవంతంగా పథకాలు అమలు

2

# సరికొత్తగా సీఎం రేవంత్ విలేజ్

- సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం
- కొండారెడ్డిపల్లి చరిత్ర సృష్టించింది
- తొలి సౌర విద్యుత్ గ్రామంగా రికార్డు
- పనులు దాదాపు తుది దశకు
- దేశంలో రెండో గ్రామంగా చరిత్ర
- రూ.10.53 కోట్ల వ్యయంతో ప్రాజెక్ట్

> తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి చరిత్ర సృష్టించింది. దేశంలో తొలి సౌర విద్యుత్ గ్రామంగా రికార్డు నెలకొల్పింది. సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా మారింది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి సౌర గ్రామంగా రికార్డులకెక్కింది.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈ మేరకు రెడ్కో అధికారులు చేపట్టిన పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. నాగర్‌కర్నూలు జిల్లా వంగూర్ మండలంలో ఉన్న ఈ కొండారెడ్డిపల్లి ఈ ఘనత సాధించింది. సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సొంత ఊరు కొండారెడ్డిపల్లి దూసుకెళ్తోంది. ప్రస్తుతం సంపూర్ణ సౌర విద్యుత్ కలిగిన దక్షిణ భారత్ లోనే మొదటి, దేశంలో రెండో గ్రామంగా చరిత్రలో నిలువనుంది. సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిని రాష్ట్రంలోనే పూర్తిస్థాయి సోలరైజ్డ్ గ్రామంగా ఏర్పాటు చేయాలని మిగతా 2లో



# నీ ఫ్యూచర్ ఏంటో తెలుసా?

- ఫ్యూచర్ సిటీకి రేవంత్ రెడ్డి శంఖుస్థాపన
- దీనిపై రచ్చ నడుస్తోంది
- బీఆర్ఎస్ రేవంత్ తీరుపై ఆగ్రహం
- మెట్రో, ఎల్అండ్ టీ ఘటన
- ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపాటు
- సర్కస్ నడుపుతున్నారు

> తెలంగాణలో ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఇటీవల శంఖుస్థాపనలు చేసిన ఫ్యూచర్ సిటీపై రచ్చ నడుస్తోంది. బీఆర్ఎస్ రేవంత్ తీరును తీవ్రంగా ఎండగడుతుంది. ఇప్పటికే మెట్రో నుంచి ఎల్ అండ్ టీ ఎందుకు వెళ్లిపోయిందో సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈక్రమంలో తాజాగా.. రేవంత్ తీరుపై ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి మండిపడ్డారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



అసలు రేవంత్ రెడ్డి ఫ్యూచర్ ఏందో ఆయనకే తెలియదు.. ఇంక ఫ్యూచర్ సిటీ ఎక్కడిదంటూ ఎద్దేవా చేశారు. అక్కడ లేని ఫ్యూచర్ సిటీ నుంచి.. కట్టని అమరావతికి గ్రీన్ ఫీల్డ్ హైవే అంట, మళ్లీ దాని పక్కన రైలు అంట.. ఈవిధంగా రేవంత్ ప్రజల్ని మాయ చేస్తున్నాడన్నారు. ఇక హైదరాబాద్, అమరావతికి గురుశిష్యులు తిరుగుతారేమో అంటూ ఎద్దేవా చేశారు. ఇదంతా కేవలం రియల్ఎస్టేట్ దందా కోసమే అంటూ జగదీష్ రెడ్డి తీవ్రమైన వ్యాఖ్యలు చేశాడు. పెరుగుతున్న జనాభాకు ఇంకో 50 ఏళ్లకు సరిపోయే పద్ధతుల్లో మెట్రోను మూడు ఫేజ్‌ల్లో విస్తరించాలని కేసీఆర్ ఆనాడు చెప్పాడన్నారు. దీనికి క్యాబినెట్ సమావేశంలో చర్చ చేసి, మంత్రుల అభిప్రాయాలను తీసుకొని అవసరమున్న చోట మెట్రో విస్తరణ చేయడానికి ప్రణాళికలు చేశాడన్నారు. మూడు ఫేజ్‌ల్లో హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల ప్రజలకు అనువుగా ఉండేట్టు, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు కలుపుతూ మెట్రోను కట్టాలని నాడు సీఎంగా ఉన్న కేసీఆర్ ప్రణాళికలు మిగతా 2లో



# ఇండస్ట్రీకి 22 వేల కోట్లు లాస్




- ఇండస్ట్రీని పైరసీ భూతం వెంటాడుతుంది
- రిలీజ్ అయిన ఫస్ట్ డేనే హై క్వాలిటీ
- ఆన్ లైన్‌లో మూవీస్ లింక్స్
- పోలీసులు పైరసీపై ఉక్కుపాదం
- అతి పెద్ద పైరసీ నెట్‌వర్క్ ధ్వంసం
- ఆరుగురు సభ్యుల ముఠా అరెస్ట్

> అన్ని చర్యలు తీసుకుంటున్నా ఇండస్ట్రీని పైరసీ భూతం వెంటాడుతూనే ఉంది. రిలీజ్ అయిన ఫస్ట్ డేనే హై క్వాలిటీతో ఆన్ లైన్‌లో మూవీస్ లింక్స్ వచ్చేస్తున్నాయి. తాజాగా తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు పైరసీపై ఉక్కుపాదం మోపారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దేశంలోనే అతి పెద్ద పైరసీ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశారు. ఆరుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. ఈ ముఠా సభ్యులు తెలుగు, హిందీ, తమిళం సహా అనేక భాషల సినిమాలను రిలీజ్ అయిన రోజే థియేటర్లలో రికార్డు చేసి అమ్ముతున్నట్లు గుర్తించారు. క్రిప్టో కరెన్సీ ద్వారా లావాదేవీలు జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు ఈ పైరసీ వల్ల ఇండస్ట్రీకి దాదాపు రూ.22 వేల కోట్ల నష్టం జరిగినట్లు తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ తెలిపిన వివరాల మిగతా 2లో

# మూడేళ్లలో 241 కోట్లు సంపాదించా!

- 2025 బీహార్ ఎన్నికలు
- జన్ సూరాజ్ పార్టీ అధినేత
- మూడేళ్లలో 241 కోట్లు సంపాదన
- 98 కోట్లు తన పార్టీకి విరాళం
- రెండు గంటలకు 11 కోట్లు
- హత్యల కేసులో చౌదరీ పేరు

> బిహార్ 2025 ఎన్నికల సందర్భంగా జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్, బిహార్ డిప్యూటీ సీఎం సమ్రాట్ చౌదరీపై ఆరోపణలు చేస్తూ, తన వ్యక్తిగత ఆదాయ వివరాలను ప్రకటించాడు.



**విశాలభారతి, జాతీయం:**

గత మూడు సంవత్సరాల్లో తను 241 కోట్ల రూపాయలు సంపాదించానని, వాటిలో 30.95 కోట్లు జీఎస్టీ , 20 కోట్లు ఆదాయ పన్నుగా చెల్లించానని తెలిపారు. మొత్తం 98 కోట్లు తన పార్టీకి విరాళం ఇచ్చానన్నారు. ఒక సందర్భంలో రెండు గంటలకు 11 కోట్లు తీసుకున్నానని కూడా తెలిపారు. ప్రశాంత్ కిషోర్ ప్రధాన ఆరోపణలు బిహార్ డిప్యూటీ సీఎం సమ్రాట్ చౌదరీపై గురించి చేశారు. 1995లో తారాపూర్‌లో జరిగిన ఆరు కుశ్వాహా కుల వ్యక్తుల హత్యల కేసులో చౌదరీ పేరు నిందితుడిగా ఉందని కిషోర్ ఆరోపించాడు. కోర్టులో చౌదరీ తన వయస్సు 14 సంవత్సరాలు అని తప్పుడు డాక్యుమెంట్లతో ప్రూవ్ చేసి, మిగతా 2లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం
30.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



## ఆల్మట్టిపై సుప్రీంలో పోరాటం

**హైదరాబాద్:** ఎగువ కృష్ణా నదిపై కర్ణాటకలో నిర్మించిన ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో బలంగా పోరాడాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుసేన్, సలహాదారులు ఆదిత్యనాథ్ దాస్‌తో మంత్రి సోమవారం జలసౌధలో సమీక్ష నిర్వహించారు. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణం కోసం ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు సవరణ డీపీఆర్ రూపకల్పనను వేగిరం చేయాలన్నారు. మంత్రివర్గ సమావేశంలో తీర్మానించిన వెంటనే ఎస్ఎల్‌బీసీ సొరంగం నిర్మాణ పనులు పునరుద్ధరించాలని ఆదేశించారు. కల్వకుర్తి, దేవాదుల ప్యాకేజీ–6 పనుల సవరణ అంచనాలతోపాటు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు, ఖమ్మంలోని నీటిపారుదల శాఖ భూములకు సంబంధించిన ఫైళ్లను మంత్రివర్గ సమావేశం ముందు పెట్టేందుకు సిద్ధం చేయాలని చెప్పారు.



# గిన్నిస్ రికార్డులో మన బతుకమ్మ

మొదటి పేజీ తరువాయి



సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలోనే ఉంది. ఈ సాంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 'బతుకమ్మ' పండుగను భాద్రపదమాసం అమావాస్య నుంచి తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుపుకుంటారు. సద్దుల పండుగ పండుగను ప్రతి ఏటా దసరాకి రెండు రోజుల ముందు నిర్వహిస్తారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. ఆడబిడ్డలందరూ రంగు రంగుల పూలను బతుకమ్మలా పేర్చి చుట్టూ చప్పట్లు కొడుతూ ఒక లయతో తిరుగుతూ బతుకమ్మ పాటలను పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపుప్వ బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళల కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు కనిపిస్తాయి. బతుకమ్మ పాటల్లో ఎన్నో చరిత్రలు, పురాణాలు మేళవిస్తారు. ఎన్నో చారిత్రక పాటలు పాడుతారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి. నవాబులు, భూస్వాముల పెత్తందారీ తనంలో నలిగిపోతున్న తెలంగాణ గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వారి అకృత్యాలకు నలిగిపోయిన వారిని, తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నవారిని తలచుకొని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" పాటల వెనుక ఉండే మర్మం ఇదేనని పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గల్లి నుంచి గ్లోబల్ వరకు ఏదైనా సాధిస్తామని మహిళలు నిరూపించారన్నారు. ఏ రంగంలోనైనా ముందుడుగు వేస్తామని అన్నారు. ఇంతగొప్ప కార్యక్రమం చేసిన సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. బతుకమ్మకు ప్రతిష్టాత్మక గిన్నిస్ రికార్డ్ కోసం రెండు నెలలుగా కృషి చేసి కార్యక్రమం విజయవంతం చేసిన అందిరికి ఈ సందర్భంగా సీతక్క అభినందలు తెలియజేశారు.

# స్థానిక సమరం..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ఇకపోతే తొలిసారి జెడ్పీటీ, ఎంపీటీసీ ఎన్నికలు ఆ తర్వాత సర్పంచ్ ఎన్నికలు జరపనున్నట్లు తెలిపింది. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేలా ఎన్నికల సంఘం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల...**

తెలంగాణలోస్థానిక సంస్థలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఎన్నికలపై అటు రాష్ట్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, జెడ్పీ చైర్మన్ల రిజర్వేషన్లు సైతం ప్రభుత్వం ఖరారు చేసింది. రిజర్వేషన్లు ఖరారు పూర్తి కావడంతో ఇక ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఎన్నికలకు న్యాయపరమైన ఆటంకాలు రాకుండా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. ఈ క్రమంలో ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం కోసం షెడ్యూల్ పంపించింది. అయితే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నికల షెడ్యూల్ విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది.

**5 విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలు...**

తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నికలు 5దశల్లో నిర్వహించాలని నిర్ణయించింది.ఇందులో భాగంగా తొలుత ఎంపీటీసీ (మండల పరిషత్ సభ్యులు), జెడ్పీటీసీ (జిల్లా పరిషత్ సభ్యులు) ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎస్ఈసీ రాణికుముదిని తెలిపారు. ఇది రెండు విడతలలో నిర్వహించనున్నట్లు ఎస్ఈసీ పేర్కొంది. ఆ తర్వాత సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతాయని పేర్కొంది.ఈ ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎస్ఈసీ పేర్కొంది.ఆ రోజునే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. అలాగే సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ఎన్నికలు మూడు దశల్లో నిర్వహించబడతాయని .ఎంపీటీసీ మరియు జెడ్పీటీసీ ఫలితాలు నవంబర్ 11న ప్రకటించబడతాయి. అయితే సర్పంచ్ మరియు వార్డు సభ్యుల ఫలితాలు పోలింగ్ జరిగిన రోజునే వెల్లడించబడతాయి అని ఎస్ఈసీ రాణి కుముదిని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ మొత్తం నవంబర్ 11తో ముగియనుంది అని స్పష్టం చేశారు.ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ నేటి నుంచి అమల్లోకి వచ్చినట్లు ఎస్ఈసీ రాణి కుముదిని ప్రకటించారు.

### తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వివరాలు...

- అక్టోబర్ 9న స్థానిక ఎన్నికల నోటిఫికేషన్
- రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు
- 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు
- అక్టోబర్ 23, 27న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు
- పోలింగ్ రోజునే పంచాయతీ ఎన్నికల ఫలితాలు
- నవంబర్ 11న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు

# సరికొత్తగా సీఎం రేవంత్ విలేజ్

మొదటి పేజీ తరువాయి




అధికారులకు గతంలోనే సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. రూ.10.53 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు కారణంగా గ్రామస్తులకు కరెంటు బిల్లులు లేవు. అదనంగా విద్యుత్ ఎగుమతి ద్వారా ఆదాయం వస్తోంది. ఇది రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధనానికి ఒక మైలురాయిగా నిలిచింది. గతంలో సీఎం ఆదేశాల మేరకు కొండారెడ్డిపల్లిని రాష్ట్రంలో మోడల్ సోలార్ విలేజ్‌గా మార్చేందుకు తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీజీరెడ్కో) ప్రణాళికలు చేపట్టింది. రెడ్కో చేపట్టిన పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ప్రణాళికలో భాగంగా కొండారెడ్డిపల్లిలో రూ.134 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఇక ప్రస్తుతం ఈ గ్రామంలో 514 ఇళ్లు, 11 ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. వీటిపై రూ.10.53 కోట్లతో సౌర విద్యుత్ పనులను తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొండారెడ్డిపల్లిలోని ప్రతి ఇంటిపై 3 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సౌర ఫలకాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాంతోపాటు గ్రామంలోని ప్రభుత్వ భవనాలపై 60 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ ఫలకాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ మేరకు రెడ్కో చేపట్టిన పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. మరోవైపు కొండారెడ్డిపల్లిలో 34 ఇళ్లు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఎంపికయ్యాయి. ఆ ఇళ్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. అవి పూర్తి అయిన వెంటనే ఆ ఇండ్లపై కూడా సౌర ఫలకాలను ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఈ 34 ఇండ్లపైనా సౌర ఫలకాలు ఏర్పాటు చేస్తే కొండారెడ్డి పల్లి గ్రామం మొత్తం సౌర విద్యుత్ గ్రామంగా మారనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

# అచ్చమైన దసరా కానుక

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలోని పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుభవార్త అందించారు. ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి రూ. 104 కోట్ల బిల్లులను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మొత్తాన్ని త్వరలోనే కార్యదర్శుల ఖాతాల్లో జమ చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పరిపాలన వ్యవస్థకు వెన్నెముకగా ఉండే పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఒకే దఫాలో ఇంత పెద్ద మొత్తాన్ని కేటాయించడం, ఉద్యోగుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని వెల్లడిస్తోంది. ఈ ఆర్థిక చర్య పట్ల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిధులు విడుదల కావడం వల్ల కార్యదర్శులు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు కొంతవరకు పరిష్కారం అవుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో పంచాయతీ కార్యదర్శులు గ్రామీణ అభివృద్ధి పథకాలు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పన, పన్నుల వసూలు వంటి కీలక బాధ్యతలను నిర్వహిస్తారు. గత కొన్ని నెలలుగా వారి బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో వారు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ సమస్యను గుర్తించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, పాలనలో జాప్యానికి తావు లేకుండా ఉద్యోగులకు సకాలంలో చెల్లింపులు చేయాలనే సంకల్పాన్ని ఈ చర్య ద్వారా తెలియజేసింది. ముఖ్యంగా.. గ్రామ పంచాయతీల బలోపేతానికి, పరిపాలనలో పారదర్శకత తీసుకురావడానికి ఈ కార్యదర్శులు నిరంతరం శ్రమిస్తారు. వారికి సకాలంలో ఆర్థిక సహాయం అందించడం వలన.. వారు మరింత ఉత్సాహంతో, నిబద్ధతతో పనిచేసే అవకాశం ఉంది. ఈ ఆర్థిక సహాయం, పెండింగ్‌లో ఉన్న వివిధ గ్రామీణ పథకాల అమలుకు, ఇతర నిర్వహణ ఖర్చులకు కూడా కొంతవరకు ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నిర్ణయం ద్వారా గ్రామీణాభివృద్ధిని మరింత వేగవంతం చేయాలనే లక్ష్యం నెరవేరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దసరా పండగ సందర్భంగా ఈ నిధులు విడుదల కావడంతో కార్యదర్శులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకానికి పెద్ద ఎత్తున అవకాశం కల్పించగా, వారిలో చాలామంది శాశ్వత ఉద్యోగులుగా మారారు. 2018 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 9 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశారు. ప్రస్తుతం చాలా మంది గ్రూప్ 1, గ్రూప్ 2 వంటి పెద్ద పోస్టులకు ఎంపిక కావడంతో వెళ్లిపోయారు. దీంతో చాలా వరకు వీటిలో ఖాళీ పోస్టులు ఏర్పడ్డాయి. వీటిని తెలంగాణ ప్రభుత్వం తదుపరి నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

## నీ ఫ్యూచర్ ఏంటో తెలుసా?

మొదటి పేజీ తరువాయి



చేశాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఒక మాట మాట్లాడితే, మంత్రులు, ఎమ్మెల్యేలు మరో మాట మాట్లాడుతున్నారన్నారు. వీళ్ళు ప్రభుత్వాన్ని నడుపుతున్నారా..? లేక.. సర్కస్ ను నడుపుతున్నారా?.. అంటూ ఫైర్ అయ్యారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మైక్ ముందు ట్రిపుల్ ఆర్ రోడ్డు వెంటనే పూర్తి చేస్తామని అంటాడు.. బాధితులు వెళ్తే అది ఇప్పట్లో అవ్వదు వెళ్ళిపొండిని అంటాడని సెటైర్ లు వేశాడు. సినిమాలకు ముందు రోజు టికెట్ రేట్లు పెంచితే, తనకు తెలియకుండా పెంచారని అంటాడన్నారు. జూపల్లి కృష్ణారావు లిక్కర్ బ్రాండ్లను తనకు తెలియకుండా మార్చారు, తనకు తెలియకుండా నోటిఫికేషన్లు ఇచ్చారని అంటాడన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిరుద్యోగులకు ఇస్తామన్న ఉద్యోగాలు ఇవ్వకుండా ఈ ప్రభుత్వం మోసం చేసింది అంటాడు.. మళ్ళీ పొద్దుగాల రేవంత్ రెడ్డికి, నాకు మధ్య గ్యాప్ ఏమి లేదని అంటాడన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఈ ప్రభుత్వంలో కమిషన్ల దందా నడుస్తుంది.. పొల్యూషన్ చేస్తున్న కంపెనీలను తగలబెడుతా అని అంటాడన్నారు. మరోవైపు.. ఎల్లారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నా నియోజకవర్గంలో వరదలు వచ్చాయి, మా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ప్రపంచ బ్యాంకుకు లేఖ రాశాడని గుర్తు చేశాడు. ప్రపంచ బ్యాంకు కేంద్రం అనుమతి లేకుంటే రాష్ట్ర ప్రభుత్వానికే అప్పు ఇవ్వదని, ఆయన తన నియోజకవర్గానికి అప్పు ఇవ్వాలని లేఖ రాశాడన్నారు. చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అసలు రిజర్వేషన్లే సరిగ్గా చేయలేదని చీఫ్ సెక్రటరీకి లేఖ రాశాడన్నారు.

# మూడేళ్లలో 241 కోట్లు సంపాదించా!

మొదటి పేజీ తరువాయి

బెయిల్ పొందాడని కిషోర్ విమర్శించాడు. అయితే, చౌదరీ 2020 ఎన్నికల అఫిడవిట్‌లో తన వయస్సు 51 సంవత్సరాలు అని చెప్పాడన్నారు. సమ్రాట్ చౌదరీని వెంటనే డిస్మిస్ చేసి, అరెస్ట్ చేయాలన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారిపై ఆరోపణలు చేస్తున్న సమయంలో ప్రశాంత్ కిషోర్ తన ఆదాయ వివరాలు వెల్లడించారు. "2021–2024 మధ్య వివిధ రాజకీయ పార్టీలు , కంపెనీలకు కన్సల్టెన్సీ సలహాలు ఇచ్చి 241 కోట్లు సంపాదించాను. వాటిలో 30.95 కోట్లు జీఎస్టీ (18శాతం), 20 కోట్లు ఆదాయ పన్నుగా చెల్లించాను. వ్యక్తిగతంగా 98 కోట్లు జన్ సురాజ్ పార్టీకి విరాళం ఇచ్చాను" అని చెప్పారు. "నేను దొంగతనం చేయను, సలహా ఇచ్చి డబ్బు తీసుకుంటాను. బిహార్ అభివృద్ధి కోసం పని చేస్తాను" అని కిషోర్ స్పష్టం చేశాడు. పార్టీని నడపడటానికి డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయని బీజేపీ నేతలు కూడా తిరిగి ఆరోపణలు చేస్తున్నారు. వారికి పీకే ఈ కౌంటర్ ఇచ్చారు. కిషోర్ చాలా మంది మంత్రులపై ఆరోపణలు చేస్తున్నారు. ఆరోగ్య మంత్రి మంగళ్ పాండే , బీజేపీ ఎంపీ సంజయ్ జైస్వాల్‌పై కూడా అవినీతి ఆరోపణలు చేశారు. పాండే భార్య ఖాతాలో 2.12 కోట్లు డిపాజిట్ అయిన విషయాన్ని ప్రశ్నించాడు. సమ్రాట్ చౌదరీ విద్యార్హతలపై కూడా ప్రశ్నలు వేశారు. 10వ తరగతి పాస్ కాకుండా డీ లిట్ డిగ్రీ ఎలా పొందాడని ప్రశ్నిస్తున్నారు. ఈ ఆరోపణలు బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్‌డీఏపై ఒత్తిడి పెంచాయి.

# 'నా స్టాప్ వచ్చేసింది.. ఇక బై'

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నాల్గున్నర సంవత్సరాలకు పైగా టీజీఎస్ఆర్టీసీ సారథిగా పనిచేసిన వీసీ సజ్జనార్ ఐపీఎస్ బదిలీ సందర్భంగా చేసిన ఒక భావోద్వేగ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఆయన పదవీ విరమణ సందేశాన్ని ఒక ప్రయాణంతో పోల్చుతూ రాసిన విధానం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

**ఆర్టీసీ సేవలకు సెలవు.. సజ్జనార్ ట్వీట్**

'సుసంపన్నమైన నాలుగేళ్లకు పైగా టీజీఎస్ఆర్టీసీకి నాయకత్వం వహించిన తర్వాత, ఈ 'బస్సు' దిగి.. కొత్త మార్గంలో పయనించాల్సిన సమయం వచ్చింది. ప్రయాణాలు ఆగవచ్చు, ప్రయాణికులు ముందుకు సాగవచ్చు.. కానీ రహదారి ఎప్పుడూ ముందుకు సాగుతూనే ఉంటుంది. ఈ బస్సును పార్క్ చేసి, తదుపరి సవాలు వైపు వేగంగా పయనించాలి' అంటూ సజ్జనార్ తన బదిలీని అత్యంత హుందాగా ప్రకటించారు. ఆయన ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 'టీజీఎస్ఆర్టీసీకి ప్రధాన ఆధారం అయిన డ్రైవర్లు, కండక్టర్లకు.. అలాగే సంస్థను నడిపించిన ప్రతి అధికారికి, ప్రయాణికులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. ఆయన దృష్టిలో ప్రజా రవాణా కేవలం ప్రయాణం మాత్రమే కాదని, 'ఆరోగ్యకరమైన పర్యావరణం, ఆరోగ్యవంతమైన జీవితం' కోసం తీసుకునే ఒక గొప్ప నిర్ణయమని భావించారు. తాను ఎప్పటికీ ప్రజా రవాణాకు గర్వించదగిన ప్రతినిధిగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ అద్భుత ప్రయాణంలో తాను పొందిన అనుభవాలు, గుణపాఠాల గురించి పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తానని తెలిపారు.

**ఆర్టీసీకి సజ్జనార్ అందించిన సేవలు..**

వీసీ సజ్జనార్ సంస్థకు ఎండీగా పనిచేసిన కాలం టీజీఎస్ఆర్టీసీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. ఆయన తన పదవీకాలంలో ఆర్టీసీని ప్రజలకు మరింత చేరువ చేయడంలో, సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. సరుకు రవాణా (కార్గో) సేవలను వినూత్నంగా విస్తరించి, సంస్థకు అదనపు ఆదాయ వనరులను సృష్టించారు. టికెట్ బుకింగ్, బస్సు ట్రాకింగ్ వంటి సేవలను సాంకేతికంగా మెరుగుపరిచారు. 'మన ఆర్టీసీ' నినాదంతో సంస్థకు కొత్త బ్రాండింగ్ ఇచ్చారు. సోషల్ మీడియాను యాక్టివ్ గా ఉపయోగించి.. ప్రజలతో మెరుగైన అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం వంటి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ముఖ్యపాత్ర వహించారు. సామాన్య ప్రయాణికుడిలా బస్సులో ప్రయాణించి.. వారి సమస్యలను, అవసరాలను స్వయంగా తెలుసుకోవడం ద్వారా ఆర్టీసీ పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచారు. ఆయన సేవలను గుర్తిస్తూ, ప్రభుత్వం వీసీ సజ్జనార్‌ను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఈ కొత్త సవాలులో కూడా ఆయన తనదైన శైలిలో దూకుడుగా పనిచేస్తారని అందరూ ఆశిస్తున్నారు.

# ఇండస్ట్రీకి 22 వేల కోట్లు లాస్

మొదటి పేజీ తరువాయి




ప్రకారం... 'ఈ పైరసీ గ్యాంగ్ చాలా కాలంగా యాక్టివ్‌గా ఉంది. ముఠా సభ్యులు చాలా కాలంగా సినిమాలను సీక్రెట్‌గా థియేటర్లలో హిడెన్ కెమెరా ద్వారా రికార్డ్ చేసి వాటిని టెలిగ్రామ్, ప్రోటాన్ మెయిల్ వంటి ప్లాట్ ఫామ్స్‌లో అప్‌లోడ్ చేసే వారు. అరెస్టైన వారిలో ఎక్కువ మంది హైదరాబాద్, పరిసర ప్రాంతాల వారే. వారి నుంచి ల్యాప్‌టాప్స్, హార్డ్ డిస్కులు, ఇంటర్నెట్ డివైస్‌లు, ఇతర సాంకేతిక సామగ్రి స్వాధీనం చేసుకున్నాం.' అని చెప్పారు.

**40కి పైగా తెలుగు సినిమాలు...**

గత 18 నెలల్లో ఈ నెట్వర్క్ 40కి పైగా తెలుగు సినిమాలను లీక్ చేసినట్లు చెప్పారు పోలీసులు. 'థియేటర్‌లో రిలీజ్ కాగానే అవి అక్రమ వెబ్ సైట్లలోకి అందుబాటులోకి వచ్చేవి. ఈ ముఠా అంతర్జాతీయ పైరసీ ప్లాట్ ఫాంలతో '1TamilMV' వంటి వెబ్‌సైట్లతో కూడా సంబంధం కలిగి ఉంది. వారి క్రిప్టో వాలెట్ ట్రాన్సాక్షన్స్ ట్రాక్ చేసి లొకేషన్‌ను ట్రేస్ చేశాం.' అని వెల్లడించారు.

**అలా వెలుగులోకి...**

తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ యాంటీ వీడియో పైరసీ సెల్ కంప్లైంట్ ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. అలాగే, 'హ్యాష్ ట్యాగ్ సింగిల్' సినిమా పైరసీపైనా గతంలో పోలీసులకు ఫిర్యాదు అందింది. జులై 3న వనస్థలిపురానికి చెందిన కిరణ్‌ను అరెస్ట్ చేసి విచారించగా.. ఈ పైరసీ ముఠా దుబాయ్, నెదర్లాండ్, మయన్మార్‌లో ఉన్నట్లు గుర్తించారు. అలాగే, ఈటీవీ విన్ కంటెంట్ పైరసీ చేసి అమ్ముకున్న మరో నిందితుడిని సైతం అరెస్ట్ చేశారు. థియేటర్లలో ప్లే అయ్యే శాటిలైట్ కంటెంట్ ఐడీ, పాస్‌వర్డ్‌లను క్రాక్ చేసి... ఏజెంట్లకు రికార్డ్ కెమెరాలు అందజేసి రహస్యంగా ఎలా రికార్డ్ చేయాలో నేర్పిస్తున్నారు. అలాగే, వారికి టికెట్స్ బుక్ చేసి థియేటర్లలోనూ రికార్డు చేయిస్తున్నారు. చొక్కా జేబులు, పాప్ కార్న్ డబ్బా, కోక్ టిన్లలో కెమెరాలు పెట్టి మూవీ షూట్ చేస్తున్నారు. ఏజెంట్లకు కూడా క్రిప్టో కరెన్సీ రూపంలోనే కమీషన్ అందిస్తున్నట్లు గుర్తించారు. ఈ ముఠా అరెస్ట్ కావడం సినీ పరిశ్రమకు గుడ్ న్యూస్ అని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధి అన్నారు. 'కేవలం 2024లోనే పైరసీ వల్ల రూ.3,700 కోట్లు నష్టపోయాం. ఈ గుంపు సౌత్ ఇండియన్ సినిమాలపై తీవ్ర ప్రభావం చూపుతూనే ఉంది.' అని చెప్పారు. మూవీ పైరసీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. నిందితులకు ఏడేళ్ల జైలు, జరిమానా విధిస్తామని అన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం
30.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
3
vishalabharathi Telugu Daily
GENERAL NEWS



# ప్రజలంతా సంతోషంగా ఉండాలి

## కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్, విశాల భారతి:

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్దేవ్పల్లి డివిజన్ పరిధిలోని వాంబే కాలనీలో దుర్గామాత అమ్మవారి దేవాలయంలో 8వ రోజు శ్రీ సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని చిన్నారులకు అక్షరాభ్యాసం చేసి వారికీ పాఠ్య పుస్తకాలు, పలకలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీర్వాదంతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



# ఆర్.ఓ ప్లాంట్ ప్రారంభం

## కమిషనర్ వెంకటరామిరెడ్డి

చౌటుప్పల్, విశాలభారతి:

మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు తాళ్లసింగరం కొత్తపేట కాలనీ లో దివిస్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్.ఓ ప్లాంట్ ను ప్రారంభించిన చౌటుప్పల్ మున్సిపల్ కమీషనర్ గుత్తా వెంకట్ రాంరెడ్డి మరియు దివిస్ జనరల్ మేనేజర్ పెంద్యాల సుధాకర్ . ఈ కార్యక్రమంలో పాల్గొన్న చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు సుర్వి నర్సింహ గౌడ్, గుత్తా శ్రీధర్ రెడ్డి మారుపాక నర్సింహ గౌడ్, కొసనమ రాంరెడ్డి ,బొంగు మల్లేష్ ,మండారి మార్క్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తోర్పునూరి శ్రీకాంత్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు దొనకొండ కృష్ణ ,మారుపాక సతాయ్య,మారుపాక స్వామి, మారు పాక జంగయ్య,కొండాపురం గణేష్, దొన కొండ నర్సింహ,బండమీద వెంకటేష్, నల్ల గణేష్, కోతి శ్రీనివాస్ రెడ్డి,రామస్వామి, పోలేపల్లి ముత్తయ్య, బత్తుల అంజయ్య, సంకబుడ్డి ఐలయ్య, మారుపక గణేష్,పెద్దగొని నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# దేవాలయ ముఖాద్వారం ప్రారంభించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే

ఎల్బీనగర్, విశాలభారతి:

బి ఏన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయ నగర్ కాలనీలో కీ!!శే!! శ్రీ కటికరెడ్డి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీ కటికరెడ్డి అరవింద్ రెడ్డి నిర్మించిన శ్రీశ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయం ముఖాద్వారం (ఆర్చ్ )ని ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన ఎల్ బి నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, వనస్థలిపురం, లగ్గొని శ్రీధర్ గౌడ్, వెంకటేశ్వర్ రావు, వైస్ చైర్మన్ కృష్ణారావు, సత్యనారాయణ రెడ్డి,కాలనీ కన్వినర్ పుల్లారెడ్డి, కో కన్వినర్ రఘురామ్ నేత, గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, సెక్రటరీ శ్రీధర్ రావు, ఉపాధ్యక్షులు వెంకటరమణ, పాపారావు, నారాయణ,కాలనీ వాసులు పాల్గొన్నారు.



# అంబరాన్ని అంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు

తిరుమలగిరి,విశాలభారతి:

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే సద్దుల బతుకమ్మ పండుగ. తొమ్మిది రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు మిగిలిన రోజుల కంటే 9వ రోజు పేర్చే బతుకమ్మ చాలా పెద్దదిగా తీరక్క పువ్వులతో అలంకరించబడి ఉంటుంది. ఎన్ని రకాల పువ్వులు దొరికితే అన్ని రకాల పువ్వులతో ఎత్తైన బతుకమ్మను పేరుస్తారు పెద్ద బతుకమ్మతో పాటు చిన్న బతుకమ్మను కూడా తయారు చేస్తారు ఆ తర్వాత పసుపు గౌరీదేవి ప్రతిమను తయారుచేసి పూల మధ్యలో ఉంచి పూజిస్తారు. పూజ తరువాత ఆ పసుపును మహిళలు ఒకరికొకరు రాసుకుంటారు మహిళలు పసుపు, కుంకుమలతో సౌభాగ్యంగా ఉండాలని ఇలా చేస్తారు. ఆ తరువాత గుండెపూరిలో మహిళలు బతుకమ్మలతో మధ్యలో ఆటలాడి పాటలు పాడి బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

# మెట్రోపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం

## బిఆర్ ఎస్ రాజేంద్రనగర్ ఇంచార్జి కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్, విశాల భారతి :



శంషాబాద్ వరకు మెట్రోను ఎట్టి పరిస్థితుల్లోనూ సాధిస్తామని రాజేంద్రనగర్ బిఆర్ ఎస్ ఇంచార్జి కార్తీక్ రెడ్డి అన్నారు. తనతో పాటు బిఆర్ఎస్ నాయకులను ఎందుకు అరెస్ట్ చేశారో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మెట్రోను నిర్లక్ష్యం చేస్తుందని సోమవారం మైండ్ స్పేస్ సమీపంలో గత ప్రభుత్వం వేసిన శిలాఫలకం వద్ద ధర్నా చేస్తుండగా వారిని పోలీసులు అరెస్టు చేసి నార్సింగి పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాము దొంగతనం, దోపిడీ చేయలేదని, అలాంటి పరిస్థితుల్లో పోలీసులు ఎందుకు అరెస్టు చేశారో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రేవంత్ మెట్రోను నిర్లక్ష్యం చేసున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో అమలు కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ సర్ కారు మోసం చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తీవ్ర స్థాయిలో ఆక్షేపించారు. మెట్రోను సాధించేందుకు పోరాటం చేసా మన్నారు. కుల సంఘాలతో పాటు కాలనీ వాసులను ఏకం చేసి పోరాటాని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. మెట్రో నిర్లక్ష్యంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాత్ర కూడా ఉందని ధ్వజమెత్తారు. శంషాబాద్ వరకు మెట్రో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందు తుందన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రావు కోళ్ల నాగరాజు, బి ఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

# బిసి 42శాతం రిజర్వేషన్లు ఎబిసీడి వర్గీకరణ చేయాలి

## పైళ్ళ ఆశయ్య రాష్ట్ర తెలంగాణ రజక వృత్తిదారుల ప్రధాన కార్యదర్శి

చౌటుప్పల్, విశాలభారతి:



పట్టణ కేంద్రంలోని రజక సంఘం జనరల్ బాడీ సమావేశం సామకూర యాదయ్య అధ్యక్షతన మార్కెట్ యార్డ్ నందు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్లలో 42 శాతం లో ఏ,బి,సి,డి వర్గీకరణ చేపట్టి బీసీలు అన్ని కులాలకు సమానంగా అందించాలని సందర్భంగా డిమాండ్ చేశారు. 120 కులాలు ఉన్నటువంటి బీసీ లోపట కేవలం నాలుగైదు కులాలు మాత్రమే స్థానిక సంస్థల రాజకీయ రిజర్వేషన్లు పొందుతున్నాయని మిగిలిన కులాలకు కనీసం గ్రామపంచాయతీ మెట్లు కూడా ఎక్కలేని పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ, జడ్పిటిసి, గ్రామపంచాయతీ సర్పంచ్ వార్డ్ మెంబర్లలో ఏబిసిడి వర్గీకరణ చేపట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు. రజకుల పైన పెద్ద ఎత్తున జరుగుతున్న కుల వివక్షత దాడులు,దౌర్జన్యాలు అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వ కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బాతరాజు యాదగిరి, జిల్లా కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేష్,కానుగు బాలరాజు,సామకూర యాదయ్య,మలిగే ధశరథ,మలిగే నరసింహ,బాలకృష్ణ,మలిగే జంగయ్య, బాతారాజు వెంకటేశం,గరిశే నరసింహ, ఐతారాజు లక్ష్మయ్య, సారయ్య,కానుగు శివ,మలిగే బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు

కురవి, విశాలభారతి:



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కోత్తూరు (జి) గ్రామ పంచాయతీలో బతుకమ్మ పండుగను గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు ఉప్పలయ్య ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పంచాయతీ ప్రాంగణం పూలతో, దీపాలతో కళకళలాడగా, గ్రామంలోని మహిళలు, యువతులు సంప్రదాయ బట్టలతో బతుకమ్మలను అందంగా అలంకరించి తెచ్చారు. మధురమైన పాటలు, చప్పుళ్లు, గోలతో వాతావరణం ఉత్సాహంగా మారింది. ఈ సందర్భంగా బట్టు ఉప్పలయ్య మాట్లాడుతూ, “మన బతుకమ్మ పండుగ స్త్రీ శక్తిని, ప్రకృతి సంపదను, మన తల్లి తండ్రుల సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. ఈరోజు గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా జరుపుకోవడం ఆనందదాయకం. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పల్లె సంస్కృతిని కాపాడుతూ, మహిళలకు అండగా నిలుస్తుంది” అన్నారు. ఆయన మాటలకు గ్రామ పెద్దలు, మహిళలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక పోటీలు కూడా నిర్వహించగా, పిల్లలు, యువతులు పాటలు, నృత్యాలతో అలరించారు. బతుకమ్మ చుట్టూ ఆటలతో పల్లె వాతావరణం పండుగలా మారింది. చివరగా గ్రామంలోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసి సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు కట్లా జనార్ధన్, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బట్టు నరసయ్య, సినియర్ నాయకులు కట్ల వెంకన్న, నాగేశ్వరరావు, కృష్ణ, వేణుగోపాల్, నరేష్, వెంకన్న, శ్రీను, రమేష్, నాగేశ్వరరావు, అరవింద్, స్థానిక యువకులు పెద్ద ఎత్తున హాజరై బతుకమ్మ సంబరాలను ఘనవంతం చేశారు.

# మిత్ర యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం

## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్

చౌటుప్పల్, విశాలభారతి:



మున్సిపాలిటీ విద్యానగర్ కాలనీలో మిత్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ తన చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దుర్గమ్మ సన్నిధిలో అన్నదాన కార్యక్రమానికి నన్ను ఆహ్వానించి నాతోటి ప్రారంభించిన ఉత్సాహ కమిటీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. అమ్మవారి ఆశీర్వాదంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి పూజలు నిర్వహించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహ కమిటీ సభ్యులు పాలకూర్ల మహేష్,బాలరాజు,రవి,పాలకూర రమేష్,ఎండి అమీద్,జమల్ పూర్ సాయి, సునీల్, అభి, వంశీ, రవితేజ, పాశం మణిదీప్, ఉత్తేజ్,యశ్వంత్, వికాస్ మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బంగారు మైసమ్మ ఆలయంలో ఉత్సవాలు

సికింద్రాబాద్, విశాలభారతి:



దసరా శరన్ననవరాత్రుల లో భాగంగా సోమవారం మధుర నగర్ లోని బంగారు మైసమ్మ దేవాలయం లో అమ్మవారు సరస్వతి అలంకరణ లో దర్శనమిచ్చారు... ఈ సందర్భంగా జరిగిన ప్రతేక పూజల్లో భాగంగా కేరళ తంత్రి డాక్టర్ నరసింహ శాస్రి ముఖ్య అతిగా హాజరైనారు... మూల నక్షత్రం సందర్భంగా ఆలయ లో చండి హొూమం నిర్వహించడం జరిగింది.



# రాంపురంలో విద్యుత్తు లైన్ పనులు ప్రారంభం

వాజేడ, విశాలభారతి:

ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని రాంపురం గ్రామంలో విద్యుత్తు లైన్ పనులు భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రత్యేక చొరవతో సోమవారం ప్రారంభమయ్యాయి. రాంపురం గ్రామ పెద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు బుల్లె వెంకన్న, గొడ్డే సాయిబాబు, నల్లగాస్ రమేష్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న రాంపురం గ్రామస్తులకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతో భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొల్లె నరేష్ బోల్లే వెంకటేశ్వర్లు తోట నరసింహులు తోట విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



# అమ్మవారికి ప్రత్యేక పూజలు

సికింద్రాబాద్, వి శాలభారతి :

బౌధనగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్షకిరణ్ డివిజన్ లోని పలు దుర్గాదేవి మండపాలను నాయకులతో కలిసి దర్శించుకుని అన్నదాన కార్యక్రమాలలో పాల్గొనడమూ జరిగినది.



# యువత కూచిపూడి, భరతనాట్యం పై దృష్టి సారించాలి

## కాంసెట్టి శైలజ భాస్కర్ గుప్తా మాజీ కౌన్సిలర్

చౌటుప్పల్ విశాలభారతి:

మున్సిపాలిటీ పరిధిలో హనుమాన్ నగరర్ హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాత మండపం వద్ద యూనివర్సల్ కిడ్స్ ప్రీ స్కూల్ నాట్యరాజన్ డ్యాన్స్ అకాడమీ వారి సహకారంతో చిన్నారులతో సాంప్రదాయ కలలైన కూచిపూడి మరియు భరతనాట్యం చిన్నారులు చక్కగా ప్రదర్శన చేసి భక్తులని అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 18వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ కాంశెట్టి శైలజ భాస్కర్ గుప్తా హాజరై, తదనంతరం వారు మాట్లాడుతూ చిన్నారులకు సినిమా డ్యాన్సులు కాకుండా ఇలాంటి సాంప్రదాయ కూచిపూడి భరతనాట్యం నేర్పించాలని అన్నారు. అలాగే దుర్గామాత మండపాల వద్ద సినిమా పాటలు కాకుండా భక్తి గీతాలు వెయ్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ నగర్ పెద్దలు భీమిడి మోహన్ రెడ్డి,కాసోజు గోవర్ధన చారి,హనుమాన్ యూత్ అధ్యక్షులు శ్యామల సత్యనారాయణ,గదుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షులుతడక అమర్,కాసోజు మధు,యోగి శ్రీకాంత్ కిరణ్,ఓర్సు రాజు,నాట్యరాజన్ డాన్స్ అకాడమీ నిర్వాహకురాలు సంధ్య చేత నృత్యాలు చేశారు. మరియు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం
30.09.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






# సికింద్రాబాద్‌లో ఘనంగ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**సికింద్రాబాద్,విశాలభారతి:**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సికింద్రాబాద్‌లో ఘనంగా జరుగుతున్నాయి.ఈసందర్భంగా అమ్మ వారు రోజు కొక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు.నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారి ఆలయాల్లో , వాడ వాడలా వెలిసిన మండపాల్లో కూడా ప్రతి రోజు ప్రత్యేక పూజలు జరుగు తు న్నాయి.భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.మేడిబావిలోని పోచమ్మ,ముత్యాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు కనుల పండు వగా జరుగుతున్నాయి. సోమవారం అమ్మ వారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ పరికిబండ కళా ప్రకాష్ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారం భించారు. మహిళలు సామూహిక కుంకు మార్చనలో పాల్గొన్నారు.ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# అమ్మవారి పూజలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్

**సికింద్రాబాద్, విశాలభారతి :**


బౌద్ధనగర్ న్యూ అశోక్ నగర్ జై భజరంగ్ బలి మిత్ర మండలి మోహన్ రావుఏర్పాటుచేసిన అమ్మవారి మండపంలో బౌద్ధ నగర్ మాజీ కార్పొరేటర్ పి.స్వరూప గౌడ్ పూజలు నిర్వ హించారు. అలాగే బిజెపి డివిజన్ అధ్యక్షులు పి. సాయి ప్రసాద్ గౌడ్ దర్శించుకోవడం జరిగింది.



# గుంతలను పూడిపించిన యువకుడు

**ఆర్మూర్, విశాలభారతి:**

నందిపేట్ నుండి బాద్గుణ వరకు వచ్చే ప్రధాన రహదారి పైన గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళలో తరచు ప్రమాదాలు జరుగుతున్నవి, గుంతలను స్వచ్ఛందంగా బాద్గుణ గ్రామానికి చెందిన చిట్టేటి నర్సారెడ్డి సోమవారం రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తన సొంత ఖర్చులతో ట్రాక్టర్ సహాయంతో చదును చేపించారు. ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేశారు.



# దేవీ నవరాత్రి ఉత్సవాల మండపాలను దర్శించుకున్న నాయకులు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఎంఆర్వో ఆఫీస్ ఆవరణలో ఎస్ఆర్‌వై టీం, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం, శ్రీనివాస కాలనీ, రాఘవేంద్ర కాలనీ, ముదిరాజ్ కాలనీ, సాయి సిద్ధార్థ కాలనీ, బృందావన్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు.కార్పొరేటర్ మాట్లాడుతూ – "అమ్మవారి ఆశీస్సులతో డివిజన్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, బాటసింగారం రైతు సహకార సంఘం డైరెక్టర్ ముత్యాల రాజశేఖర్, ఎర్ర రవీందర్ సీనియర్ నాయకులు సంఘీ అశోక్, అరుణ్, బీజేవైఎం సీనియర్ నాయకులు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి పూజలు

**సికింద్రాబాద్, విశాలభారతి:**



వారసిగూడ ఏ ఆర్ కే నగర్ పార్సిగుట్టలో తుల్జా భవాని ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీ ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బెజ్జంకి రాజేష్ హాజరై పూజలో పాల్గొన్నాడు. ఈ కార్యక్రమంలో నాయకులు జల సాయి యాదవ్, చందు, అశోక్ యాదవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ కాలక్షేపం

## అబద్ధాల కాంగ్రెస్ కు కాలం చెల్లింది

## రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**



మోసపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ కాలక్షేపం చేస్తుందని , నిజస్వరూపాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు , మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. అబద్ధాల కాంగ్రెస్ కు తగురీతిలో బుద్ధిచెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ఉద్ఘాటించారు. సోమవారం జరిగిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ఆవేధన చెందుతున్నారని చెప్పారు. అన్ని వర్గాలకు మేలు చేసిన కేసీఆర్ ను కాదనుకుని కాంగ్రెస్ పార్టీని నమ్మిన ప్రజలు తాము మోసపోయామని గ్రహించారని అన్నారు. రైతులు , కూలీలు , మహిళలు , యువత , విద్యార్థులు , ఉద్యోగులు తమకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే పోలీసులతో నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు యేడాదిలో భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే నిరుద్యోగులను నిలువునా వంచించారని విమర్శించారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఇంటింటికి వెళ్లి గుర్తు చేయవలసిన బాధ్యత బిఆర్ఎస్ కార్యకర్తలపై ఉందన్నారు. సమర్థులైన నాయకులను , పార్టీ కోసం ప్రజల కోసం పనిచేసే వారిని స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులుగా నిలబెట్టి గెలిపించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ , మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి , జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి , సీనియర్ నాయకులు జక్క రాంరెడ్డి , దండెం రాంరెడ్డి , ఆకుల యాదగిరి , పల్లె గోపాల్ గౌడ్ , బూడిద రాంరెడ్డి , చక్రవర్తి గౌడ్ , మాజీ ఎంపిపిలు కృపేష్ , రజితారాజునాయక్ , మండల పార్టీ అధ్యక్షులు కర్నాటి రమేశ్ గౌడ్ , చిలుకల బుగ్గరాములు , కొత్త కిషన్ గౌడ్ , చీరాల రమేశ్ , మున్సిపల్ అధ్యక్షులు కొప్పు జంగయ్య , అల్వాల్ వెంకట్ రెడ్డి నాయకులు పాల్గొన్నారు..

# సాంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

## పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

## కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే ఆడబిడ్డలకు గౌరవం

## పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

**తొర్రూరు, విశాలభారతి:**



బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక అని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొని నృత్యం చేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ బిడ్డల సంస్కృతి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని, ఎంగిలిపూల బతుకమ్మ నుండి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు మహిళలు ఆనందోత్సవాలలో జరుపుకున్నారని అన్నారు. మహిళా సంఘ సభ్యులకు బతుకమ్మ పర్వదినం సందర్భంగా రెండేసి చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళ సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు మహిళలను దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్,కాంగ్రెస్ నాయకులు పెదగాని సోమయ్య, చాపల బాపు రెడ్డి, డాక్టర్ పోనుగోటి సోమేశ్వరరావు, గంజి విజయపాల్ రెడ్డి, మంగళపల్లి రామచంద్రయ్య, జీనుగా సురేందర్ రెడ్డి, కందాడి అచ్చిరెడ్డి, వెంకటాచారి, నర్కూటి గజానంద్, సంధ్యారాణి భాస్కర్ రెడ్డి, దొంగరి శంకర్, కుషాల్, జలీల్,మనోహర్, వెలుగు మహేశ్వరి, మహేష్ యాదవ్, మధు, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కీసర గుట్టలో సరస్వతి అలంకరణతో అమ్మవారు

**కీసర,విశాలభారతి:**

కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర దేవస్థానంలో నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని శివ దుర్గా సమేత అమ్మవారికి ఎనిమిది వ రోజు సరస్వతి దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ తటాకం నారాయణ శర్మ,మాజీ చైర్మన్ తటాకం రమేశ్ శర్మ,ట్రస్టు బోర్డు సభ్యులు మొరుగు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# వైన్ షాపులకు దరఖాస్తులు ఆహ్వానం

## ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి

## ఇప్పటివరకు రెండు మాత్రమే

## పారదర్శకంగా లైసెన్సుల ప్రక్రియ

**మహబూబాబాద్, విశాలభారతి:**



జిల్లాలో 2025-27 లైసెన్స్ కాలానికి (డిసెంబర్ 1, 2025 నుండి నవంబర్ 30, 2027 వరకు) సంబంధించి వైన్ షాపుల లైసెన్స్ కోసం దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 26వ తేదీన ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేయగా, సోమవారం 29వ తేదీ నాటికి రెండు దరఖాస్తులు అందినట్లు జిల్లా ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జి.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని షాప్ నెంబర్ Gz.Sl.No.009 కు బయ్యారం గ్రామానికి చెందిన కొత్త రవి దరఖాస్తు సమర్పించగా, మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని Gz.Sl.No.031 కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన ఆమంచి శ్రీదేవి దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు రెండు మాత్రమే దరఖాస్తులు రావడం గమనార్హమని అధికారులు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తిగల వారు ముందుకు వస్తారని భావిస్తున్నామని ఎక్సైజ్ శాఖ తెలిపింది. ప్రజా పారదర్శకతకు అనుగుణంగా అన్ని దరఖాస్తులు రిజిస్టర్‌లో నమోదు చేసి, గడువు తేదీ తరువాత లాటరీ విధానంలో అనుమతులు మంజూరు చేయబడతాయని ఇన్స్పెక్టర్ తెలిపారు.



## దేవాలయంలో దుర్గామాత కుంకుమార్చన

### ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దండెం రాంరెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో దుర్గామాత కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నేత దండెం రాంరెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరై దుర్గామాతకు కుంకుమార్చన చేసి, అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# కలెక్టరేట్‌లో కన్నుల పండుగా బతుకమ్మ సంబరాలు

**మేడ్చల్ ,విశాలభారతి :**



సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆటాపాటలతో గౌరమ్మను కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే పండుగే బతుకమ్మని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు.జిల్లా కలెక్టరేట్ లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ,ఎడి సర్వే అండ్ ల్యాండ్, జిల్లా ట్రెజరీ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా బతకమ్మ సంబరాలు జరుపుకున్నారు.తీరొక్క పూలతో పెద్దగా బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఘనంగా బతుకమ్మను ఆడారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి శారద,ఎడి సర్వే అండ్ ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, జిల్లా ఇంఛార్జి ట్రేజరీ అధికారి హైదర్ అలీ,మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కీసరలో కన్నుల పండుగా బతుకమ్మ సంబరాలు

**కీసర,విశాల భారతి :**

ఆడపడుచులు అందరు తీరొక్క పూలతో బతుకమ్మను ఇంట్లో పేర్చుకుని సోమవారం కీసర మహంకాళి ఆలయం వద్ద బతుకమ్మలను తీసుకొచ్చి బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.మహిళలు అందరు ఆటాపాటలతో గౌరమ్మను కలిశారు.



# సామూహిక శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలంలోని దుర్గాదేవి (డిడి) కాలనీలో ఏర్పాటుచేసిన సామూహిక శ్రీ వేంకటేశ్వర స్వామి రథోత్సవాన్ని కాలనీవాసులు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది దుర్గాదేవి కాలనీలోనీ వీధి వీధిలో రథాన్ని తిప్పి ఆ స్వామి వారిని ఊరేగించడం జరిగింది. ఈ యొక్క రథోత్సవంలో కాలనీవాసులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని రథాన్ని లాగడం జరిగింది అనంతరం స్వామివారినీ గుడిలో దింపి పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దుర్గా దేవి కాలనీవాసులు భక్తులు చిన్నలు పెద్దలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఆ స్వామివారి ఆశీస్సులు పొందారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

### వేడుకల్లో పాల్గొన్న రావుల శ్రీను నాగలక్ష్మి



**జక్కలవారిగూడెం, విశాలభారతి:**

గ్రామంలో సోమవారం సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా రావుల శీను నాగలక్ష్మి వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామపంచాయతీ వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలలో ఆయన పాల్గొని ఆడపడుచులు అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జక్కల శ్రీను జక్కల అశోక్ , జక్కల శివ, జక్కల సందీప్, రావుల.స్వామి జక్కల పార్వతమ్మ, లక్ష్మి,శ్రావణి,శిరీష,వైష్ణవి,పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

# పహల్గంలో బతుకమ్మ ఆడిన

## జనగామ జిల్లా ఉపాధ్యాయనులు

**దేవరుప్పుల, విశాలభారతి:**

దసరా సెలవుల్లో జమ్మూ కాశ్మీర్ విహారయాత్ర కి వెళ్లిన జనగామ జిల్లాలోని బాలాజీ పరపతి సంఘం 25 ఉపాధ్యాయ దంపతుల సభ్యులు తెలంగాణ సంప్రదాయ పండగ బతుకమ్మ పండగను పహల్గం లో కాశ్మీర్ వాసుల ముందు ఆడి పాడారు. జమ్మూ కాశ్మీర్ లో వైష్ణో దేవి ఆలయం, సోన్ మార్గ్ ,గుల్మార్గ్ , కార్గిల్ పాయింట్, అమర్నాథ్ పాయింట్ చూసిన అనంతరం సద్దుల బతుకమ్మ రోజైన సోమవారం నాడు పహల్గం సైట్ సీయింగ్ చూసి పహల్గం లోని హొటల్ లో బస చేయవలసి వచ్చింది.. సద్దుల బతుకమ్మ రోజు కాబట్టి మన సంప్రదాయం మరిచిపోకుండా జమ్మూ కాశ్మీర్ లో పూచే పువ్వులను సేకరించి బతుకమ్మని తయారు చేసి మన సాంప్రదాయ పండగను పహల్గం వాసులకు పరిచయం చేశారు... ఆసక్తిగా మన జనగామ వాసులు ఆడిన బతుకమ్మ ఆటని తిలకించారు... గతంలో పాకిస్థాన్ ఉగ్రవాదుల చేతిలో అమరులైన మన భారతీయులకు నివాళులు అర్పించి మన తెలంగాణ సాంప్రదాయ బతుకమ్మను వారికి పరిచయం చేశారు... పహల్గం లో రాత్రి బస అంటే భయపడిన మన తెలంగాణ మహిళలు,తర్వాత ఈ పహాలగం మన



భారత దేశంలో అంతర్భాగం అని మనకి భయం ఎందుకు అని మన సైనికులు మనకు తోడుగా ఉన్నారని ధైర్యంగా ఉండి పహల్గం లో రాత్రి బస చేశారు.ఈ సారి సద్దుల బతుకమ్మ నీ పహాలగాం లోనే సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మన కాశ్మీరం అద్భుతమైన ప్రదేశం అని, భూతల స్వర్గం అని, అందరూ కాశ్మీర్ సందర్శించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో సుజాత, మంజుల, లలిత, రజనీ, ఉమా, రుక్మిణి, శ్రీవాణి, పద్మ, గీతాంజలి, సుహిత, సరిత, జయశ్రీ మొదలగు వారు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారం మా బాధ్యత

### కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప కాలనీలో నూతన సిసి రోడ్ల నిర్మాణ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ - “కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే నాకు సమాచారం ఇవ్వండి. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తాను. ప్రజా సమస్యల పరిష్కారం నా బాధ్యత” అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# రుణాలను సకాలంలో చెల్లించాలి




### పిఏసిఎస్ చైర్మెన్ వెదిరే హన్మంత్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:**

ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో రుణాలు తీసుకున్న సభ్యులు తిరిగి తొందరగా చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని మంచాల పీఏసిఎస్ చైర్మన్ వెదిరే హన్మంత్ రెడ్డి అన్నారు. పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో సోమవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పరిపాలన నివేదికను సంఘం కార్యనిర్వహణ అధికారి రమేష్ చదివి వినిపించారు. అనంతరం చైర్మెన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. సభ్యుల నుండి రూ . 32 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. తీసుకున్న రుణాలను చెల్లిస్తేనే కొత్త రుణాలను ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. సహకార సంఘం అభివృద్ధి ధ్యేయంగా నిరంతరం పాలకవర్గ సభ్యులతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. నోముల, మంచాల గ్రామాలలో పెట్రోల్ బంక్, పాలసేకరణ కేంద్రం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సహకార సంఘంలో అటెండర్ గా పనిచేసి ఇటీవల మృతి చెందిన జహంగీర్ కుటుంబానికి సంఘం తరుపున రూ.50 వేల చెక్కును డైరెక్టర్లతో కలిసి అయన అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు , సొసైటీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఏర్పాటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

### లండన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

పార్టీ ఏర్పాటుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తెలిపారు. లండన్‌లోని తెలంగాణ ప్రవాసులతో కవిత ముఖాముఖి మాట్లాడారు. 20 ఏళ్లు భారత రాష్ట్ర సమితి కోసం కష్టపడ్డాను. కొందరిలో స్వార్థం పురుడుపోసుకుంది.



వారివల్ల కోట్లాది మంది బాధపడొద్దన్నదే నా తపన. పార్టీలో చీలికలు రావొద్దని ఎంత ఇబ్బందైనా తట్టుకొని నిలబడ్డాను. పార్టీలో చాలా అవమానాలు ఎదురయ్యాయి. నా ఓటమి మొదలు అసెంబ్లీ ఎన్నికల్లో భారాస ఓటమి వరకు ఎన్నో కుట్రలు జరిగాయి. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఇప్పుడు మాట్లాడాల్సి వచ్చిందని అన్నారు. తెలంగాణ జాగృతిని దేశానికి రోల్ మోడల్‌గా నిలపాలన్నదే సంకల్పమని చెప్పారు. సామాజిక తెలంగాణ కోసం జాగృతి పనిచేస్తుందన్నారు. అవసరం, సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతాం. ప్రజల జీవితాల్లో మార్పులు తేవడంపై స్పష్టమైన ఆలోచన ఉంది. తప్పనిసరిగా నాకు అవకాశం వస్తుంది. ఎన్నికలకు ఇంకా మూడున్నరేళ్ల సమయం ఉంది. అప్పటి వరకు ఎలాంటి మార్పులు వస్తాయో చూడాలి. నా వెనక ఏ జాతీయ పార్టీ లేదు.. జాతీయ పార్టీల్లో చేరే ఉద్దేశం కూడా లేదు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే పడవ. అభివృద్ధి పథంలో సాగుతున్న తెలంగాణను భ్రష్టు పట్టిస్తోంది. భాజపా డీఎన్‌ఏ నాకు సరిపడదన్నారు. విషయం ప్రజల్లోకి వచ్చిన తర్వాత వాటిపై స్పందించకపోతే తప్పవుతుంది. అందుకే మాట్లాడాల్సి వచ్చింది. పార్టీ నన్ను వద్దనుకుంది కాబట్టే.. పార్టీ ఇచ్చిన పదవిని వద్దనుకున్నాను. నిర్ణీత నమూనాలో రాజీనామా చేశాను. ఛైర్మన్ ఎందుకు ఆమోదించడం లేదో తెలియదు. నేను ఈ పరిస్థితికి రావడానికి అవతలి వాళ్లే కారణం. కష్టమవుతుందని తెలిసినా.. కేసీఆర్ బిడ్డగా ధైర్యంగా పంథాను ఎంచుకుంటాను. జైలు జీవితం నాలో అనేక మార్పులు తీసుకొచ్చింది. సమూలంగా మార్చేసింది. నిజమైన మార్పు కోసం తెలంగాణ ఉద్యమకారులు ఒక్కటై పని చేయాలని కవిత అన్నారు. ఇదిలావుంటే తెలంగాణ పూల సింగిడి బతుకమ్మ పండుగ ఎల్లలు దాటింది. తెలంగాణలోనే కాకుండా పలు దేశాల్లోనూ బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు తెలుగువారు. వివిధ పనిల నిమిత్తం విదేశాల్లో ఉంటున్నప్పటికీ మూలాలు మర్చిపోకుండా తెలంగాణ సంస్కృతి, వైభవాన్ని చాటుతూ కెనడా, అమెరికా, ఖతర్, యూఏఈ, యూకే వంటి దేశాల్లోని తెలుగు ప్రజలు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది లండన్‌లో కన్నుల పండుగగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. లూటన్ సిటీలో ఉంటున్న తెలుగు ప్రజలు లూటన్ తెలుగు అసోసియేషన్ (ఎల్‌టీఏ) ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చిన ఆటపాటలతో మహిళలు సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పడుతూ, పూలను పూజిస్తూ, గౌరమ్మను ఆరాధించారు ఆడబిడ్డలు. ఈ సందర్భంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. బతుకమ్మలను పేర్చినవారందరికీ అసోసియేషన్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఎంతో ఆనందభరితంగా సాగిన ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.



# దుర్గమాత ఉత్సవ మండపం వద్ద బతుకమ్మ, దాండియా

### తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించిన బతుకమ్మ వేడుకలు

### ఉత్సాహంగా ఆడి పాడిన మహిళలు, యువతులు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పసుమాముల గాంధీ విగ్రహం వద్ద దుర్గమాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారిని ఏడవ రోజు శ్రీ మహా చండీదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంస్కృతి సాంప్రదాయ ప్రతీక అయిన బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు,యువతులు, చిన్నారులు పెద్ద ఎత్తున హాజరై బతుకమ్మ, దాండియా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉత్సాహంగా ఆడి పాడారు. వృద్ధ మహిళలు ఆలపించిన బతుకమ్మ పాటలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గమాత ఉత్సవ కమిటీ అధ్యక్షులు వడ్డేపల్లి స్వామి గౌడ్, సభ్యులు, దాతలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనగర్ కాలనీలో వైభవంగా బతుకమ్మ సంబరాలు




### మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంలో పసుమాముల గ్రామం శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మహిళలు, చిన్నారులు, కాలనీ సభ్యులు పెద్ద ఎత్తున హాజరై సాంప్రదాయ బతుకమ్మను ఆడుతూ పాడుతూ ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఈ వేడుకలు కాలనీ అంతటా పండుగను తీసుకువచ్చాయి. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సోమయ్య, వైస్ ప్రెసిడెంట్ చైతన్య, జనరల్ సెక్రటరీ యాకూబ్ పాషా, ట్రెజరర్ అరవింద్, జాయింట్ సెక్రటరీ హెచ్డీఎఫ్సి శ్రీనివాస్, కల్చరల్ సెక్రటరీ శ్రీకాంత్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రామకృష్ణ, వెంకటరమణ, కాలనీ మాజీ అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

## కాశ్మీర్, లద్దాఖ్‌లకు కేంద్రం ద్రోహం

జమ్ముకాశ్మీర్, లడఖ్ రాష్ట్ర హోదాలపై ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని కేంద్రాన్ని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మండిపడ్డారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరించడంలో జాప్యం చేయడం ద్వారా అవిశ్వాసాన్ని పెంచడం ద్వారా జమ్ముకాశ్మీర్, లడఖ్ రెండింటికీ ద్రోహం చేసిందని అన్నారు. కేంద్రం తన సొంత రోడ్‌మ్యాప్‌ను అనుసరించడంలో విఫలమైందని, 'అసాధ్యమైన' హామీలతో రెండు రాష్ట్రాలను తప్పుపట్టించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లడఖ్ కౌన్సిల్ ఎన్నికల సమయంలో లడఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో చేర్చుతామని హామీ ఇచ్చిందని అన్నారు. అయితే అది అసాధ్యం అని అందరికీ తెలుసు. ఒకవైపు చైనాతో, మరోవైపు పాకిస్తాన్‌తో సరిహద్దులను కలిగి ఉన్న ప్రాంతానికి గణనీమైన రక్షణ అవసరమని అన్నారు. ఎన్నికల కోసం తప్పుడు వాగ్దానాలు చేశారని మండిపడ్డారు. లడఖ్ నేతల పట్ల, ముఖ్యంగా వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పట్ల కేంద్రం భిన్నమైన వైఖరి ప్రదర్శించడాన్ని కూడా విమర్శించారు. గతంలో ప్రధానిని పర్యావరణ యోధుడిగా కొనియాడారని, 2019లో కేంద్రపాలిత ప్రాంతం (యుటి) హోదా కల్పించి, అక్కడి ప్రజల కలలను నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపినపుడు ఎవరూ తప్పుపట్టలేదని అన్నారు. అటువంటి పెద్దమనిషికి అకస్మాత్తుగా ఈరోజు పాకిస్తాన్‌తో సంబంధాన్ని గుర్తించామని చెప్పారని ఇప్పటికిప్పుడు గుర్తించారని కేంద్రాన్ని నిలదీశారు. మొదట డీలిమిటేషన్, తర్వాత ఎన్నికలు,